సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024






## ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



## నిర్లక్ష్యం చేస్తే చర్యలు

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఏఎస్‌డబ్ల్యూవో వెంకటేశ్ హాస్టల్ సిబ్బందిని హెచ్చరించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

37.1 /21.8

## వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

# మలి సంధ్యలో ఏదీ ఆసరా?



■ దోమకొండకు చెందిన నిమ్మ లక్ష్మి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసి రిటైర్ అయ్యింది. ఉద్యోగ విరమణ చేసి మూడున్నర నెలలు గడిచినా ప్రభుత్వంనుంచి ఎలాంటి బెనిఫిట్స్ అందలేదు. రిటైర్ కాగానే ఆసరా పెన్షన్ ఇస్తామని చెప్పిన సర్కారు.. దాని ఊసే ఎత్తడం లేదు. దీంతో ఎవరికీ భారం కాకూడదన్న ఉద్దేశంతో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని, వెంటనే పింఛన్‌తోపాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరుతోంది.

- ఉద్యోగ విరమణ చేసి మూడున్నర నెలలు
- ఇప్పటికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించని ప్రభుత్వం
- మనోవేదనకు గురవుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

**రాష్ట్రంలో 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు,** ఆయాలను ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తప్పించి మూడున్నర నెలలు గడిచాయి. ఇప్పటికీ ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కల్పించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. వేతనం లేకపోవడం, పెన్షన్ మంజూరు చేయకపోవడంతో పూట గడవని స్థితిలో కూలి పనులకు వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పెన్షన్‌తో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతున్నారు.

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి :** అంగన్‌వాడీలలో తప్పనిసరి రిటైర్మెంట్ అమలు చేస్తూ సర్కారు నిర్ణయం తీసుకోవడంతో 65 ఏళ్లుపైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఈ ఏడాది జూన్ 30న ఉద్యోగ విరమణ పొందారు. జిల్లాలో 51 మంది టీచర్లు, 117 మంది ఆయాలు రిటైర్ అయ్యారు. అయితే అరకొర వేతనాలతో ఇన్నాళ్లూ కుటుంబాన్ని నెట్టుకుంటూ వచ్చినవారు.. ఇప్పుడు ఆ ఆసరా కూడా లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కానీ, ఆసరా పెన్షన్ కానీ అందించకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులకు తప్పనిసరి రిటైర్మెంట్‌ను అమలు చేస్తున్న సర్కారు.. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని మొదట్లో ప్రకటించింది. దీనిపై అంగన్‌వాడీ ఉద్యోగులు పెదవి విరిచారు. అరకొర వేతనాలతో మూడు నాలుగు దశాబ్దాలు పనిచేశామని, ఇప్పుడు ఈ కొద్దిపాటి డబ్బులతో ఎలా బతకాలని ప్రశ్నించారు. వారి ఆందోళనపై సర్కారు సమీక్షించింది. ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున ఇస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్వయంగా ప్రకటించారు. అలాగే ప్రభుత్వం వృద్ధులకు ఇచ్చే ఆసరా పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఆ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో ఉద్యోగ విరమణ చేసిన టీచర్లు, ఆయాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంత కాలం జీతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతికామని, ఇప్పుడు బతుకు భారంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు తమ పిల్లలపై ఆధారపడుతుండగా, మరికొందరు ఎవరి వద్దా చేయిజాపలేక బతుకు వెళ్లదీయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందిస్తే కొంత ఆసరా అవుతుందని అంటున్నారు. నెలనెలా పింఛన్ ఇస్తే ఎవరికీ భారం కాకుండా బతుకుతామని పేర్కొంటున్నారు.

### “ పింఛన్ ఇవ్వాలి..



65 ఏళ్లు దాటినయని ఉద్యోగం నుంచి తీసేసింద్రు. బతకడం కష్టంగా మారింది. కాలు విరగడంతో మంచాన పడిన. 42 ఏళ్లు ఉద్యోగం చేసిన. ప్రభుత్వం సాయం చేయాలి. ఆసరా పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి.

– పుల్కంటి భారతమ్మ, రిటైర్డ్ అంగన్‌వాడీ ఆయా, బాన్సువాడ

### పూట గడవడం కష్టంగా మారింది



రిటైర్ అయ్యి నెలలు గడుస్తున్నయి. మాకు ప్రభుత్వం ఇప్పటికీ ఒక్క పైసా ఇవ్వలేదు. పూటగడవడం కూడా కష్టంగా మారింది. ప్రభుత్వం మాకు రూ. 2 లక్షలు ఇస్తామని చెప్పింది. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ ఇవ్వాలి.

– సీతారామేశ్వరి, రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్, నెమ్లి

### ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు



వయసు అయిపోయిందని ఉద్యోగం నుంచి దించేసింద్రు. నలభై ఏండ్లకుపైగా ఉద్యోగం చేసినోళ్లను ఉత్తి చేతులతో పంపింద్రు. 3 నెలలు గడచినా నయా పైసా రాలేదు. ప్రభుత్వం వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలి.

–భాగ్యమ్మ, రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్, ఘన్‌పూర్(ఎం), మాచారెడ్డి మండలం



దేవునిపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కేవీఆర్

# ఎమ్మెల్యే రూటే సపరేటు!

- ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్
- స్కూళ్లు, హాస్పిటళ్లు, హాస్టళ్లపై ఫోకస్

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి :** అసెంబ్లీ ఎన్నికలలో ఒకేసారి ఇద్దరు ముఖ్యమంత్రి అభ్యర్థులను ఓడించి జెయింట్ కిల్లర్‌గా గుర్తింపు పొందిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్).. ఇటీవలి కాలంలో స్కూళ్లు, ఆస్పత్రులు, హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ హడలెత్తిస్తున్నారు. ఉదయమే ఏదో ఒక పాఠశాలకు చేరుకుని, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొంటున్నారు. సమయానికి హాజరు కాని ఉపాధ్యాయులు తీరు మార్చుకోవాలని సుతిమెత్తగా హెచ్చరిస్తున్నారు. హాజరు రిజిస్టర్లను పరిశీలిస్తూ.. గైర్హాజరైన ఉపాధ్యాయులు సెలవు తీసుకున్నారా? లేదా డుమ్మా కొట్టరా? అన్నదానిపై ఆరా తీస్తున్నారు. విధులకు డుమ్మా కొడుతూ సొంత వ్యాపారాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై ఆయన దృష్టి సారించారు. ఓ ఉపాధ్యాయుడు స్కూల్‌కు వెళ్లకుండా బిజినెస్‌లు చేసుకుంటుండడం, ఆయన స్థానంలో బినామీ టీచర్ కొనసాగుతుండడాన్ని తనిఖీలలో గుర్తించారు. వెంటనే డీఈవోకు ఫోన్ చేసి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సదరు టీచర్‌ను డీఈవో సస్పెండ్ చేశారు. గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనూ ఎమ్మెల్యే తనిఖీ చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండడంతో కామారెడ్డి నియోజకవర్గంలోని టీచర్లు, వైద్యులు ఆందోళన చెందుతున్నారు. విధులకు సమయానికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. లేదంటే సెలవు తీసుకోవడం ద్వారా ఇబ్బందులు పడకుండా జాగ్రత్త పడుతున్నారు.



మాచారెడ్డి పీహెచ్‌సీలో హాజరు పట్టికను పరిశీలిస్తూ..

# ఎంపీడీవో కార్యాలయానికి తాళం

**వర్ని:** అద్దె చెల్లించలేదని చందూరు ఎంపీడీవో కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. 26 నెలలుగా భవనానికి అద్దె చెల్లించడం లేదని ఇంటి యజమాని సూర్యనారాయణ తెలిపారు. నెలకు రూ. 6,358 చొప్పున మొత్తం రూ. 1,65,308 చెల్లించే వరకు కార్యాలయానికి తాళం తీయనని భీష్మించుకు కూర్చున్నారు. జిల్లా అధికారులు స్పందించి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్యాలయానికి తాళం తీశారు.



కార్యాలయానికి తాళం వేస్తున్న ఇంటి యజమాని

## న్యూస్‌రీల్

### రేపు జాబ్ మేళా

**కామారెడ్డి క్రైం:** కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ కామారెడ్డి శాఖలో పలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, డిగ్రీ ఆపైన చదివిన 30 ఏళ్ల లోపువారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సర్టిఫికెట్లతో జాబ్‌మేళాలో పాల్గొనాలని, ఇతర వివరాలకు 76719 74009, 70975 25933 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక



**కామారెడ్డి టౌన్:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలను గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. అండర్ 14, 17 విభాగాలలో పోటీలు సాగాయి. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గంగాకిషన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**టేబుల్ టెన్నిస్ పోటీలకు..**



**కామారెడ్డి టౌన్ :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను గురువారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజెన్స్ ఫోరం కార్యాలయంలో నిర్వహించారు. అండర్ -14, 17 విభాగాలలో బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించి 20 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, వ్యాయామ ఉపాధ్యాయులు స్వామిగౌడ్, సంతోష్, నాగరాజు, రఘురాం తదితరులు పాల్గొన్నారు

### దరఖాస్తుల ఆహ్వానం

**కామారెడ్డి టౌన్:** అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఈనెల 29లోపు అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత ఓ ప్రకటనలో సూచించారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ వంటి దేశాలలో ఉన్న విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యనభ్యసించేందుకు ఈ పథకం కింద స్కాలర్‌షిప్ మంజూరు చేస్తామని పేర్కొన్నారు. జీఆర్‌ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్‌లో అర్హత స్కోర్‌తో పాటు, డిగ్రీలో 60 శాతం మార్కులు సాధించినవారు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఎంపిక శిబిరం

**కామారెడ్డి టౌన్:** దివ్యాంగులకు కావాల్సిన ట్రై సైకిళ్లు, కృత్రిమ పాదాల కోసం రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఈనెల 22న ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. నెమ్లి గ్రామంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో 22న శిబిరం నిర్వహిస్తామని రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి తెలిపారు. పటోళ్ల శైలజ, మోహన్ సహకారంతో నిర్వహించే శిబిరంలో నడవలేని వారికి ట్రై సైకిళ్లు, ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన వారికి కృత్రిమ పాదాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 8106714236, 7032377227 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# ఇందిరమ్మ కమిటీలపై రచ్చ

- వార్డు కమిటీలలో కాంగ్రెస్ నేతల పేర్లను చేర్చడంపై నిరసన
- కమిషనర్‌ను నిలదీసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- కలెక్టర్‌కు ఫిర్యాదు

**కామారెడ్డి టౌన్ :** వార్డు స్థాయి ఇందిరమ్మ కమిటీలలో తాము సూచించిన పేర్లను కాకుండా కాంగ్రెస్ నాయకుల పేర్లను చేర్చడంపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఆందోళనకు దిగారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సుజాతను నిలదీశారు. బల్దియాలో 49 వార్డులకు సంబంధించి ఇందిరమ్మ కమిటీలను మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు. వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో వార్డు ఆఫీసర్ కన్వీనర్‌గా స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు మహిళలు, వార్డులో నివసించే ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి ఒక్కొక్కరిని సభ్యులుగా తీసుకున్నారు. అయితే ప్రతిపక్షాల కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులలో ఇందిరమ్మ కమిటీలలో కాంగ్రెస్ నేతల పేర్లను చేర్చడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ వార్డు కమిటీలలో ఇతర వార్డులకు చెందిన కాంగ్రెస్ నేతలు ఎలా ఉంటారని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పిట్ల వేణు, అంజల్‌రెడ్డి, స్వప్న, నజీరొద్దీన్, భాస్కర్, అఫీజ్‌లు కమిషనర్‌ను ప్రశ్నించారు. 43వ వార్డులో నివసించే మాజీ వైస్ చైర్మన్ మసూద్ అలీని తన వార్డు కమిటీలో ఎలా చేర్చారని 25వ వార్డు కౌన్సిలర్ అంజల్‌రెడ్డి నిలదీశారు. తన వార్డు కమిటీలో మొత్తం కాంగ్రెస్ నాయకుల పేర్లే ఉన్నాయని 47వ వార్డు కౌన్సిలర్ ఆరోపించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశాల మేరకు పేర్లు మార్చాల్సి వచ్చిందని కమిషనర్ సుజాత సమాధానం ఇచ్చారు. దీంతో కౌన్సిలర్లు కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

# కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

- రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**గాంధారి:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సీతాయిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు టార్పాలిన్‌లు, బస్తాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు నిబంధనల మేరకు ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రానికి తరలించాలని సూచించారు. అనంతరం ముదెల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, బాలామృతం అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. పాఠశాల తరగతి గదులు అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, సివిల్ సప్లై డీఎం రాజేందర్, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, డీటీ రవి తదితరులున్నారు.



సీతాయిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

### వాల్మీకి మహర్షికి ఘన నివాళులు



**కామారెడ్డి క్రైం:** మహర్షి వాల్మీకి గొప్ప కవిగా, తత్వవేత్తగా పేరుగడించారని కలెక్టర్ పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

**కామారెడ్డి క్రైం:** ప్రతి ఉద్యోగి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా అధికారుల సంక్షేమ సంఘం, తెలంగాణ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘాల ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. 370 మంది ఉద్యోగులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారిలో అవసరం ఉన్న కొందరికి వైద్యుల సూచన మేరకు శుక్రవారం మరికొన్ని వైద్య పరీక్షలు చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా సంఘాల ప్రతినిధులు రాజారాం, దయానంద్, సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, దేవేందర్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

# నిజాంసాగర్‌లోకి 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**నిజాంసాగర్:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉండడంతో ఒక వరద గేటు ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 1,404.98 అడుగుల(17.8టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.



# ఎస్సారెస్పీ మూడు గేట్లు ఎత్తివేత

**బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి గురువారం ఇన్‌ఫ్లో పెరగడంతో మూడు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 9,372 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి 18,823 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 5,800 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(80.5 టీఎంసీలు) అడుగులతో నిండుకుండలా ఉంది. కాగా ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటిని వదలకుండా గోదావరిలోకి విడుదల చేయడంపై ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# ‘అన్ని రంగాల్లో రాణించాలి’

**కామారెడ్డి టౌన్:** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని డీఈవో రాజు సూచించారు. కామారెడ్డి సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో జిల్లా స్థాయి కళా ఉత్సవ్- 2024 నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలకు చెందిన 120 విద్యార్థినులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. సంగీతం, నృత్యం, దృశ్య కళ, ఆర్ట్స్, సంప్రదాయ కథల పోటీలలో ప్రతిభ చాటిన ప్రణయశ్రీ, పూర్ణచంద్రిక, స్పర్శిత, క్రాంతి, రేణుకలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, పాఠశాల కరస్పాండెంట్ శ్రవణ్, విద్యాశాఖ సిబ్బంది విష్ణువర్ధన్, సంగీత, వసుధ, విజయశ్రీ, సుహాసిని, నర్సిరెడ్డి, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందిస్తున్న డీఈవో రాజు

## క్లుప్తంగా

### ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన



దోమకొండ: మండల కేంద్రంలో గురువారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. దరఖాస్తుదారులను పిలిచి స్థలాలను, వాటికి రోడ్డు సౌకర్యం ఎన్ని ఫీట్లు ఉందో ప్రత్యక్ష్యంగా చూశారు. ఈ నెల చివరి వరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ప్రశాంత్, శ్రీకాంత్, ఆర్‌ఐ మహేందర్ తదితరులు ఉన్నారు.

### డీపీవోలో వాల్మీకి జయంతి



కామారెడ్డి క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. రిజర్వ్ విభాగం సీఐలు నవీన్ కుమార్, సంతోష్ కుమార్, కృష్ణ, ఆర్‌ఎస్సైలు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మెరుగైన సేవలు అందించాలి



నిజాంసాగర్(జుక్కల్): సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రోహిత్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్ వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు సబ్ సెంటర్లకు వచ్చే రోగులకు వైద్యసహాయం అందించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు పుష్ప, సునీత, సవిత తదితరులు ఉన్నారు.

# వర్షాలకు తడిసిన ధాన్యం

జిల్లాలో పలుచోట్ల గురువారం కురిసిన భారీ వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు వారు నానా తిప్పలు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ధాన్యం కుప్పల వద్దే ఉండాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్ద కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత పది రోజులుగా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోయారు. తడిసిన ధాన్యాన్ని పలువురు పరిశీలించారు.

– సాక్షి నెట్‌వర్క్



నాగిరెడ్డిపేట శివారులో మొలకలు వచ్చిన ధాన్యం గింజలను చూపుతున్న రైతు రాజమణి



మీసాన్‌పల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సొసైటీ చైర్మన్ నర్సింలు



భవానీపేట కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

### తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

ఎల్లారెడ్డి: తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా గురువారం తెలిపారు. ఎలాంటి దిగులు చెందవద్దని అన్నారు. తడిసిన ధాన్యం విషయమై ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.

# డ్వాక్రా రుణాల్లో అవకతవకలు?

- రెడ్డిపేటలో ఘటన
- ముగ్గురి నుంచి రికవరీ చేశామన్న డ్వాక్రా సీసీ
- డ్వాక్రా అధికారుల పాత్రపై అనుమానాలు

రామారెడ్డి: రెడ్డిపేట గ్రామంలో డ్వాక్రా సంఘాలకు అందాల్సిన బ్యాంకు లింకేజీ రుణాల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్వాక్రా సంఘంలో పనిచేసే సీఏలు సభ్యుల పేరు మీద బ్యాంకులో లోన్లు తీసుకొని నొక్కేసినట్లు తెలిసింది. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డ సీసీ ఓ సీఏ దగ్గర నుంచి రూ.80 వేలు, మరో సీఏ నుంచి రూ.90 వేలు, ఇంకో సీఏ నుంచి రూ.లక్ష.20 వేలు రికవరీ చేసినట్లుగా తెలిసింది. బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న డ్వాక్రా సంఘం మహిళలు కట్టాల్సిన కిస్తీల కంటే ఎక్కువ కట్టించి బ్యాంకుకు చెల్లించకుండా తమ దగ్గరనే పెట్టుకొని అవినీతికి పాల్పడినట్లుగా తెలుస్తోంది. మరో 12 డ్వాక్రా సంఘాలలో కూడా భారీగా అవకతవకలు జరిగినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి పూర్తి విచారణ జరిపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై విచారణ చేస్తే రూ.లక్షల్లో అవినీతి బాగోతం బయటపడుతుందని చర్చించుకుంటున్నారు. రెడ్డిపేటలో ఓ బ్యాంకు, రామారెడ్డిలో రెండు బ్యాంకులు డ్వాక్రా మహిళలకు రుణాలు ఇస్తుండగా కామారెడ్డికి డ్వాక్రా మహిళలను తీసుకెళ్లి రుణాలు ఇప్పించి మహిళలను మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది.

### అంబేడ్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా బాబు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ఎర్రోళ్ల బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా నాయకులు బిట్ల సురేందర్ గురువారం తెలిపారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యక్షులుగా కృష్ణ, అంజయ్య, సాయిబాబా, ప్రధాన కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శులుగా దేవకుమార్, గంగారాంలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు సాయిబాబా తదితరులున్నారు.

### 21 నుంచి పోలీసు సంస్మరణ వారోత్సవాలు

ఖలీల్‌వాడి: ఈనెల 21 నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు సీపీ కల్మేశ్వర్ గురువారం తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో క్యాండిల్, ద్విచక్ర వాహనాల ర్యాలీలు, వ్యాసరచన పోటీలు, ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలు, రక్తదాన శిబిరం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

# 'మూఢనమ్మకాలను వీడాలి'

కామారెడ్డి క్రైం: మూఢనమ్మకాలు ఓ అద్భుత కల్పన, వాటికి దూరంగా ఉండాలని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు సూచించారు. అడ్లూరు గ్రామంలో రెండు రోజుల క్రితం ఓ వ్యక్తిపై మంత్రాల నెపంతో దాడి జరిగిన ఘటన నేపథ్యంలో గురువారం రాత్రి పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మూఢనమ్మకాలు, మంత్రాలలో నిజం లేదన్నారు. ప్రతి ఒక్కరూ సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు పాల్గొన్నారు.

# వివాదానికి దారి తీసిన ఆలయ నిర్మాణం

- మున్సిపల్ స్థలంలో నిర్మాణం
- కూల్చి వేయించిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- విగ్రహాల తరలింపు
- సీఐకి ఫిర్యాదు చేసిన కాలనీవాసులు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

కామారెడ్డి టౌన్: పట్టణంలోని 8 వార్డు హౌజింగ్ బోర్డు కాలనీలో మున్సిపల్ ఓపెన్ స్థలంలో నిర్మిస్తున్న గ్రామ దేవతల ఆలయ నిర్మాణాన్ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం తెల్లవారుజామున 4 గంటలకు కూల్చి వేయించారు. ఆ స్థలంలో ప్రతిష్ఠించిన పోచమ్మ, ముత్యాలమ్మ, లక్ష్మమ్మ విగ్రహాలను తొలగించి సానిటేషన్ కార్యాలయానికి తరలించారు. ఈ నేపథ్యంలో వార్డు కౌన్సిలర్ నిట్టు కృష్ణమోహన్‌తో పాటు కాలనీవాసులు వార్డులో ఆందోళనకు దిగారు. పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలివెళ్లి సీఐ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆలయ నిర్మాణాన్ని కూల్చి వేయడంతో పాటు విగ్రహాలు తొలగించి తీసుకెళ్లిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. మున్సిపల్‌కు సంబంధించిన ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని గతంలో నోటీసులు జారీ చేసినా మళ్లీ నిర్మాణాలు చేపట్టడంతో కూల్చివేశామని మున్సిపల్ కమిషనర్ సుజాత తెలిపారు.

# ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



తాడ్కోల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్

బాన్సువాడ/బాన్సువాడ రూరల్ : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రం, బరంగెడ్గి గ్రామాల్లో, తాడ్కోల్ సహకార సంఘం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరగడంలో కొంత ఆలస్యమైందని, రూ.2 లక్షల కంటే రుణం ఎక్కువగా ఉన్న రైతులు ఎక్కువ మొత్తం బ్యాంకులో చెల్లిస్తే ప్రభుత్వం రైతు ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము రూ.2 లక్షలు జమచేస్తుందని అన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలు తినలేని పరిస్థితి ఉన్నందున సన్న రకం ధాన్యాన్నే పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ ఇస్తుందని అన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లో పుష్కలంగా నీరున్నందున వచ్చే యాసంగి, వానాకాలం పంటలకు ఢోకా లేదని వివరించారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, నాయకులు విజయ్‌ప్రకాష్, బోయిని శంకర్, రఘు, ఖలేక్, శశికాంత్, రెంజర్ల సాయిలు, గాంధీ, కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

# ఇష్టారీతిగా భవనాల కూల్చివేత



అధ్వానంగా మారిన పాఠశాల మైదానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కలెక్టర్ ఆదేశాలిచ్చారని మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న ఉన్నత పాఠశాల భవనాన్ని కూల్చివేశారు. మండల కేంద్రానికి చెందిన ఓ అధికారి పార్టీ నాయకుడు కల్పించుకొని తీర్మానం చేసిన గదులనే కాకుండా ఇతర గదులను కూడా కూల్చివేశారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదర్ రెడ్డిని ప్రశ్నిస్తే కలెక్టర్ ఆదేశాలిచ్చారు.. అందుకే కూల్చి వేశాం అంటూ సమాధానం ఇస్తున్నారు. ఆదేశాలేమో కానీ సంబంధిత అధికార పార్టీ నాయకుడి నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు శాపంగా మారింది. కూల్చివేసిన తర్వాత వచ్చే ఇటుకలు, సిమెంటు రాళ్లతో పాఠశాల మైదానం ఆడుకోవడానికి వీలు లేకుండా పోయిందని విద్యార్థులు బాధపడుతున్నారు. పాఠశాల మైదానాన్ని చదును చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

### విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): హాస్టల్ సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఏఎస్‌డబ్ల్యూవో వెంకటేశ్ సూచించారు. హాస్టల్ సిబ్బంది పత్తాలేకుండా పోవడంతో అందులోని ఇద్దరు విద్యార్థులు భయాందోళనకు గురై ఇంటికి వెళ్లిపోయిన ఘటనపై గురువారం 'సాక్షి' దినపత్రికలో 'హాస్టల్‌లో బిక్కుబిక్కుమంటూ'అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. బుధవారం రాత్రి భయాందోళనకు గురైన విద్యార్థులతో ఆయన మాట్లాడారు. హాస్టల్‌లో ఎవరూ లేకపోవడంతోపాటు చీకటి పడటంతో తాము భయపడినట్లు విద్యార్థులు ఏఎస్‌డబ్ల్యూవోకు తెలియజేశారు. ఈ ఘటనపై హాస్టల్ వార్డెన్ రాములుకు మెమో జారీ చేస్తున్నట్లు ఏఎస్‌డబ్ల్యూవో తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వాచ్‌మన్ అన్వర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలో విద్యార్థుల ప్రతిభ



కామారెడ్డి టౌన్: శాస్త్ర సాంకేతిక విద్యామండలి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలలో పాల్వంచ మండలం ఇసాయిపేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యామండలి డైరెక్టర్ రమేష్ గైడ్ టీచర్ మాధురి, విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి తదితరులున్నారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

**SERVICES**

**CHANGE OF NAME**

■ I, BAINDLA JAGADISH, S/o. B. Bhoomaiah, R/o. H.no: 4-33, Anchanoor-V, Domakonda-M, Kamareddy Dist. Telangana. Have changed my name as BAINDLA JAGADISH KUMAR [HA-16403]

**WANTED**

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185480]

■ నూతనంగా ప్రారంభించబడిన VSR ఎంటర్‌ప్రైజెస్ నందు పనిచేయుటకు సూపర్‌వైజర్స్, ఎగ్జిక్యూటివ్ ఫీల్డ్ ఆఫీసర్స్, లేడీ టెలికాలర్స్, ITI All Trades వెంటనే కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీతం: 15,000 నుండి 25,000. ఫోన్ : 88866 60569. [V-823870]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899. [HA-1381]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## క్రైం కార్నర్

### 'సాయి ఆయుష్'లో శిశువు మృతి




నిజామాబాద్ నాగారం: నగరంలోని సాయి ఆయుష్ చిన్న పిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శిశువు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. రెంజల్ మండలం తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన గంగామణికి ఏడో నెలలో బాబు జన్మించాడు. బరువు తక్కువగా ఉండడంతోనే శిశువును చికిత్స నిమిత్తం తీసుకొచ్చిన తండ్రి నరేశ్‌గౌడ్ సాయి ఆయుష్ ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్సకు రూ.3 లక్షల ప్యాకేజీ మాట్లాడారు. 20 రోజులకుపైగా చికిత్స పొందిన శిశువు గురువారం మృతి చెందినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలపడంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, తాడ్‌బిలోలి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఇప్పటికే రూ.లక్ష చెల్లించామని తెలిపారు. వైద్యుడు వారికి సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు. వైద్యం సరిగా చేయకపోవడంతోనే శిశువు మృతి చెందాడని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ



ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంనగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సీతారాంనగర్ కాలనీకి చెందిన వ్యక్తి రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఊరెళ్లాడు. బుధవారం రాత్రి దుండగులు ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలోని రూ.25వేల నగదు, నాలుగు గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, సీసీ ఫుటేజీలో ముగ్గురు దుండగుల కదలికలను గుర్తించామని ఎస్సై తెలిపారు.

### పేకాట స్థావరంపై దాడి

ధర్పల్లి: మండల కేంద్రం శివారులో కొనసాగుతున్న పేకాటస్థావరంపై గురువారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.12 వేల నగదు, 9 సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెద్దకొడప్‌గల్(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. హస్గుల్ గ్రామానికి చెందిన పలువురు వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం ఉదయం దాడి చేశారు. పెద్దకొడప్‌గల్ జాతీయ రహదారి మీదుగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్లను తహసీల్ కార్యాలయంలో అప్పగించామన్నారు.

# వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం సేవించి వస్తున్నందుకు భార్య మందలించిందని ఒకరు, భార్య విడాకులు ఇచ్చిందని మరొకరు బలవన్మరణానికి పాల్పడగా, ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

**భార్య మందలించిందని..**

మోర్తాడ్(బాల్కొండ): రోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి ఇబ్బంది పెడుతున్న భర్తను భార్య మందలించడంతో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం భీమ్‌గల్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన దడివె రాజేందర్(59) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించడం మానుకోవాలని భార్య శోభ మందలించడంతో మనస్తాపానికి గురైన రాజేందర్ అడ్డగుట్ట వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

**భార్య విడాకులిచ్చిందని..**

మోపాల్: జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన గడ్డం రమేశ్(45) మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. మొదటిభార్య చనిపోవడంతో రమేశ్ నర్సింగ్‌పల్లికి చెందిన మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య కుమార్తెను నర్సింగ్‌పల్లికి చెందిన యువకుడికి ఇచ్చి పెళ్లి చేశాడు. రెండో భార్య విడాకులు తీసుకోవడంతో రమేశ్ మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయల్దేరిన ఆయన నర్సింగ్‌పల్లి గ్రామ శివార్లలో రాత్రి మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

**క్యాసంపల్లికి చెందిన వృద్ధురాలు..**



బాల్‌రాజవ్వ మృతదేహం

కామారెడ్డి క్రైం: మతిస్థిమితం కోల్పోయిన ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి బాల్‌రాజవ్వ (95)కు వయస్సు పైబడడంతోపాటు కొంత మతిస్థిమితం కోల్పోయింది. గురువారం ఉదయం ఇంట్లో నుంచి ఆమె బయటికి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. 12 గంటల సమయంలో సమీపంలోని చెరువులో బాల్‌రాజవ్వ శవమై తేలింది. మృతురాలి కుమారుడు సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

**బైక్ అదుపుతప్పి..**

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని హాసాకొత్తూర్ రోడ్‌లో బుధవారం అర్ధరాత్రి బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్సై నరేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌కు చెందిన దిబ్బ అనిల్(20), కనుగుర్తి శివరాజు కలిసి బుధవారం రాత్రి బైక్‌పై బషీరాబాద్‌కు వెళ్లారు. తిరిగి తాళ్ల రాంపూర్‌కు వెళ్తుండగా, వేగంగా ఉన్న బైక్ కమ్మర్‌పల్లి శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాల మూల మలుపు వద్ద అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. అనిల్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలపాలైన శివరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**గుర్తు తెలియని వాహనం ఢీకొని..**

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని కందర్‌పల్లి వద్ద నేషనల్ హైవేపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. హంగర్గా గ్రామానికి చెందిన లక్ష్మణ్ గొండ బిచ్కుంద సంతకు వచ్చి కాలి నడకన వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**తూనికలు, కొలతలశాఖ ఉద్యోగి..**



సుమన్ (ఫైల్)

మాక్లూర్: బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో పెర్కిట్‌కు చెందిన సుమన్(37) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్‌లో తూనికలు కొలతలశాఖలో పని చేసే ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్‌కు చెందిన సుమన్ గురువారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు రాంచంద్రాపల్లి శివారులో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సుమన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

**చేపల వేటకు వెళ్లి ఒకరు..**



శ్రీను మృతదేహం

గాంధారి(ఎల్లారెడ్డి): చేపలను వేటాడేందుకు వేసిన వల ప్రమాదవశాత్తు కాళ్లకు చుట్టుకోవడంతో మండల కేంద్రానికి చెందిన వడ్డె శ్రీను (60)అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. శ్రీను, గాంధారికి చెందిన మరో వ్యక్తి కాటికాపల లక్ష్మణ్‌తో కలిసి బుధవారం సాయంత్రం మండల పరిధిలోని నేరల్ గ్రామ శివారులో ఉన్న కుంటలో చేపలను పట్టేందుకు వెళ్లాడు. చేపలను వేటాడుతున్న క్రమంలో వల చుట్టుకొని శ్రీను మృతి చెందాడు. మృతుడి భార్య సాలవ్వ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో దుండగులు బుధవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. బట్టు భూమేశ్‌కు చెందిన వ్యవసాయ భూమిలో ఉన్న 51/100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఆలూర్ గంగారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### నాటుసారా పట్టివేత



సిరికొండ : మండలంలోని చీమన్‌పల్లి, పందిమడుగు, ధూప్యాతండా, మైపాల్ తండా, జనియాల తండాల్లో దాడులు నిర్వహించి 20 లీటర్ల నాటు సారాను పట్టుకున్నట్లు భీమ్‌గల్ ఎక్సైజ్ సీఐ వేణు మాధవరావు గురువారం తెలిపారు. నాటుసారా అమ్ముతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు. పాకాలకు చెందిన సభావాత్ శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనంపై పది లీటర్ల నాటు సారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న, డీటీఎఫ్ సీఐ విలాస్, సిబ్బంది పాల్గొన్నారు.